వైఎస్సార్‌సీపీలో చేరికలు శుభపరిణామం

• కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



టీడీపీకి చెందిన శ్రీనివాసులును వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: కోవూరు నియోజకవర్గంలోని ప్రతి మండలంలో టీడీపీ కనుమరుగవుతోంది. ఇప్పటికే టీడీపీ సీనియర్ నాయకులంతా ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరగా, పంచాయతీ స్థాయి నాయకులు సైతం ఆ పార్టీలోకి వలస కడుతున్నారు. శుక్రవారం కోవూరు మండలం గంగవరం గ్రామానికి చెందిన పదో వార్డు సభ్యుడు పందిటి శ్రీనివాసులు టీడీపీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరాడు. నెల్లూరులోని నివాసంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అభివృద్ధి, సంక్షేమ పాలనకు ఆకర్షితులై టీడీపీతో పాటు ఇతర పార్టీలకు చెందిన వారు వైఎస్సార్‌సీపీలో చేరుతుండడం శుభపరిణామన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా కుల,మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని వివరించారు. సీఎం వైఎస్ జగన్ పాలనను చూసిన ప్రతిపక్ష నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. నూతనంగా పార్టీలో చేరే వారు రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగాధ్యక్షుడు నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, ఎంఏఏబీ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, గంగవరం సర్పంచ్ లక్ష్మీకుమారి, ఉపసర్పంచ్ మోషే, సచివాలయ కన్వీనర్ ప్రసాద్, విజయ్‌కుమార్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



నెల్లూరు రూరల్: హక్కులు, చట్టాలపై కార్మికులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి పేర్కొన్నారు. నారాయణరెడ్డిపేటలోని సాయి మెరైన్ కంపెనీలో శుక్రవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. ఆయా కంపెనీల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. న్యాయ సాయాన్ని ఉచితంగా అందిస్తామని వివరించారు. తొలుత జీతాల చెల్లింపులు, కార్మికులకు అవసరమైన వసతులపై ఆరాతీశారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించండి



నెల్లూరు రూరల్: వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని నెల్లూరు వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాసులు సూచించారు. నెల్లూరు రూరల్ మండలం పెనుబర్తి, మాదరాజు గూడూరులోని ఆర్బీకేల్లో శుక్రవారం నిర్వహించిన గ్రామ స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వివరించారు. అనంతరం రూరల్ మండల వ్యవసాయాధికారి నాగమోహన్ మాట్లాడారు. రైతు భరోసా లబ్ధిదారుల వివరాలను ఆయా ప్రాంతాల్లోని ఆర్బీకేల్లో ప్రచురించామని, అభ్యంతరాలుంటే వ్యవసాధికారులకు తెలియజేయాలని కోరారు.

ఓటు నమోదుపై భారీ ర్యాలీ



నెల్లూరు(బారకాసు): ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటును నమోదు చేసుకోవాలని కమిషనర్ వికాస్ మర్మత్ కోరారు. ఓటరు నమోదు కార్యక్రమంపై నగరంలో భారీ ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. వీఆర్ కళాశాల మైదానం నుంచి వివిధ ప్రాంతాల్లో ర్యాలీ సాగింది. ప్లకార్డులు చేతబట్టి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాల్లో నిర్వహించనున్న ఓటరు నమోదు ప్రత్యేక ప్రచార దినోత్సవాన్ని సద్వినియోగం చేసుకొని.. ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఫారం 6, 7, 8 దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

లక్ష్మీనృసింహుడికి పూజలు



నెల్లూరు రూరల్: హిందూ ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ములుమూడిలో లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు విశేష పూజలను శుక్రవారం నిర్వహించారు. సుదర్శన హోమం, కుంకుమార్చన, కల్యాణోత్సవం తదితరాలను కనులపండువగా జరిపారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, ఆలయ ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే చర్యలు

అల్లూరు: అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తే చర్యలు తప్పవని డీఈ ఎస్ఈ శ్రీనివాసుబాబు అన్నారు. శుక్రవారం అల్లూరులో విద్యుత్ వినియోగంపై తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగానికి తగిన అనుమతులు తీసుకోవాలన్నారు. తనిఖీల్లో భాగంగా 6 మాల్ ప్రాక్టీస్ కేసులు, 42 అధికలోడు కేసులు నమోదు చేశామన్నారు. ఏ కేటగిరీకి సంబంధించిన అనుమతులు ఉంటే అందులోనే వాడుకోవాలని, అధిక లోడుకు ముందుగా దరావత్తులు చెల్లించి వాడుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఈఈలు జగదీష్‌రెడ్డి, సుధాకర్ అల్లూరు ఏఈ షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

వీఎస్‌యూ ఎన్‌ఎస్ఎస్ కోఆర్డినేటర్‌కు నేతృత్వ పురస్కారం



ఉదయ్‌శంకర్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న వీఎస్‌యూ వీసీ సుందరవల్లి

వెంకటాచలం: విక్రమ సింహపురి వర్సిటీ(వీఎస్‌యూ) ఎన్‌ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్ ప్రతిష్టాత్మక ఎన్‌ఎస్ఎస్ నేతృత్వ పురస్కారాన్ని అందుకున్నారు. వీఎస్‌యూ ఎన్‌ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విస్తృతంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంతో 2022–23 సంవత్సరానికి గానూ క్రిషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో అందజేసే నేతృత్వ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ నెల 1న క్రిషా ఫౌండేషన్ నిర్వాహకులు పోస్టు ద్వారా పురస్కారాన్ని పంపగా, వీఎస్‌యూ వీసీ జీఎం సుందరవల్లి చేతుల మీదుగా ఉదయశంకర్ శుక్రవారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ని వీసీ సుందరవల్లి, రిజిస్ట్రార్ పీ రామచంద్రారెడ్డి, ఇతర అధ్యాపకులు అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

• జిల్లా మలేరియా నివారణాధికారిణి డాక్టర్ హుస్సేనమ్మ



కసుమూరులో సీజనల్ వ్యాధులపై వగాహన కల్పిస్తున్న డాక్టర్ హుస్సేనమ్మ

వెంకటాచలం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ హుస్సేనమ్మ సూచించారు. వెంకటాచలం, కసుమూరు గ్రామాల్లో కసుమూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో కలిసి శుక్రవారం ఆమె పర్యటించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్య సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణులు పవిత్ర, ప్రవళిక, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మనుబోలు: స్థానిక వెలుగు కార్యాలయంలో స్త్రీనిధి రుణాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పొదుపు సభ్యులకు రుణాలు ఎలా మంజూరు చేస్తారు..వాటిని ఎలా వినియోగించుకోవాలి..రుణాల రికవరీ, తదితర అంశాలపై స్త్రీనిధి గుంటూరు ఏజీఎం చెన్నకేశవులు, విజయనగరం సీనియర్ మేనేజర్ సుధాకర్ అవగాహన కల్పించారు. అనంతరం మండలంలో స్త్రీనిధి రుణాల మంజూరులో గోల్‌మాల్ జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టారు. స్త్రీనిధి మేనేజర్లు హరీష్, శ్రీధర్, ఏపీఎం వనజాక్షి, సీసీలు పాల్గొన్నారు.

రైతుభరోసా జాబితాల ప్రదర్శన



కొడవలూరు: రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రైతు భరోసా నగదు రూ.2 వేలు జమ చేయనుందని, అందుకు సంబంధించిన రైతుల జాబితాలను ఆర్బీకేల్లో ప్రచురించినట్లు ఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి తెలిపారు. మండలంలోని దామేగుంట, ఆలూరుపాడు, తదితర ఆర్బీకేల్లో ప్రచురించిన జాబితాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతు భరోసాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద రూ.7,500 నగదు విడుదల చేయాల్సి ఉండగా, ఇప్పటికే రూ.5,500 రైతుల ఖాతాల్లో జమచేసిందని తెలిపారు. మిగిలిన రూ.2 వేలను ఈ నెల 7న రైతుల ఖాతాల్లో జమచేయనున్నట్లు చెప్పారు. అందుకు సంబంధించి ఆర్బీకేల్లో ప్రచురించిన అర్హులైన వారి జాబితాలను రైతులు పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. వీఏఏలు కేవీ పృధ్వీ, బీ లిఖిత, రైతులు పాల్గొన్నారు.

బీసీల బాంధవుడు సీఎం జగన్



మాట్లాడుతున్న బీసీ నాయకులు

మనుబోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల బాంధవుడని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ దాసరి భాస్కర్‌గౌడ్ పేర్కొన్నారు. స్థానిక సచివాలయ ఆవరణలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నాయకులతో కలిసి శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీలో బీసీలకు ఎనలేని ప్రాధాన్యం కల్పిస్తున్నారని తెలిపారు. బీసీలకు అత్యున్నత పదవులు కట్టబెట్టి రాజకీయంగా ప్రోత్సహిస్తున్నారన్నారు. పార్టీ అధికార ప్రతినిధి మహేంద్రవర్మ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీల సంక్షేమానికి ఎంతో పాటు పడుతోందన్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బీసీల ఎదుగుదలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఏఎంసీ ఉపాధ్యక్షుడు చెందులూరు శ్రీనివాసులుయాదవ్ మాట్లాడుతూ జిల్లాలో బీసీకి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించింది వైఎస్సార్‌సీపీ అని గుర్తుచేశారు. బీసీ నాయకులు చల్లా నవకోటి, గుంజి రమేష్, కేవీఆర్‌గౌడ్, చలగల దయాకర్, కోసూరు కోటేశ్వరగౌడ్, మన్నూరు పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో మార్పు రావాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీఈ సుధీర్‌బాబు

ముత్తుకూరు: అవినీతి రహిత సమాజ నిర్మాణానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో మార్పు రావాలని నేలటూరులోని ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్ సీఈ కే సుధీర్ బాబు అన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా స్థానిక డీఏవీ పాఠశాలలోని విద్యార్థులకు 'అవినీతి రహిత భారతదేశం' అనే అంశంపై వ్యాసరచన పోటీలను శుక్రవారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వేళ్లూనుకున్న అవినీతిని అరికడితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అవినీతి రహిత దేశం ఎలా ఉంటుందో విద్యార్థులు ఊహించాలన్నారు. విజిలెన్స్ డీఎస్పీ కొల్లూరు శ్రీనివాసులు,ఎస్ఈ, డీఈఈలు పాల్గొన్నారు.

నేడు శ్రీరామ మందిరం ప్రారంభం

కొడవలూరు: మండలంలోని గండవరం అరుంధతీయవాడలో నూతనంగా నిర్మించిన రామ మందిరాన్ని శనివారం ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు అల్లం సత్యం శుక్రవారం తెలిపారు. ఉదయం గణపతి పూజ, గణపతి హోమం, రామచంద్ర మూలమంత్ర హోమం, శిఖర ప్రతిష్ట సీతారామలక్ష్మణుల చిత్రపటాల ప్రతిష్ట, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట, మహాపూర్ణాహుతి, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. భక్తుల పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



కొడవలూరు: మండలంలోని నార్సురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ కస్తూరి గుణవర్ధన్‌కు అనంతపురం జేఎన్‌టీయూ నుంచి డాక్టరేట్ లభించింది. 'పవర్ క్వాలిటి ఎన్‌హాన్స్‌మెంట్ ఇన్ మలిపుల్ ఏసీ మైక్రో గ్రిడ్స్ బై ఏఐ కంట్రోలర్స్' అనే సిద్ధాంత వ్యాసాన్ని రాసినందుకు గానూ ఆయనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా గుణవర్ధన్‌ను కళాశాల చైర్మన్ పీ గుణశేఖర్, ప్రిన్సిపల్ వీ అనిల్‌కుమార్, అధ్యాపకులు శుక్రవారం అభినందించారు.

ఆశీర్వాదం

కోవూరు: కోవూరు పంచాయతీ పరిధిలోని కోనేటి కయ్యలు ప్రాంతానికి చెందిన సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వర్లు కుమార్తె రెసెప్షన్ శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకష్ణారెడ్డి, కోవూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు రజత్‌కుమార్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, ఎంఏఏబీ అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, వైస్ఎంపీపీ నరసింహులురెడ్డి, సచివాలయ కన్వీనర్ కే ప్రసాద్ తదితరులు ఉన్నారు.

విష్ణుమూర్తికి వెండి శఠారి బహూకరణ



మనుబోలు: స్థానిక విష్ణాలయానికి గ్రామానికి చెందిన చల్లా బలరామయ్య, మస్తానమ్మ దంపతులు శుక్రవారం వెండి శఠారిని బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు హనుమాచార్యులు ప్రత్యేక పూజలు చేసి దాతలకు తీర్థప్రసాదాలు అందజేశారు.

లక్ష్మీనరసింహస్వామికి విశేష పూజలు



పొదలకూరు : స్థానిక శ్రీనివాస లేఅవుట్‌లోని లక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహ మహోత్సవంలో భాగంగా శుక్రవారం రెండోరోజున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు విశేషాభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిమ్మసాగులో మెలకువలు పాటించాలి

• జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి

పొదలకూరు : నిమ్మ తోటలు సాగు చేసే రైతులు బెట్ట పరిస్థితులను తట్టుకునేందుకు ఉద్యానాధికారుల సూచించే మెలకువలను పాటించాలని జిల్లా ఉద్యానాధికారి ఎంవీ సుబ్బారెడ్డి సూచించారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో మండలంలోని వీఏఏలు, వీహెచ్ఏలు, రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమ్మ పాదుల్లో హైడ్రోజెల్‌ను వేసుకుంటే పదిహేను రోజుల పాటు చెట్లు నీటి ఎద్దడిని తట్టుకుంటాయని తెలిపారు. పాదుల్లో మల్చింగ్‌తో పాటు సున్నం 10 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయడం ద్వారా నిమ్మ చెట్లు బెట్టను తట్టుకుంటాయని చెప్పారు. ప్లానోఫిక్స్ 2 మి.లీ.ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయడం ద్వారా పిందెలు రాలుటను అరికట్టవచ్చునని చెప్పారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు పుచ్చ, దోస పంటలను సాగు చేసుకునేలా అవగాహన కల్పించాలని వీఏఏలకు సూచించారు. ఏపీఎంఐపీ పీడీ బీ శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యాన పంటలు సాగుచేసే రైతులు విధిగా డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సూక్ష్మ సేద్యం ప్రోత్సాహానికి ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను వివరించారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు ఉద్యానాధికారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈఏఎస్ పరీక్షకు విశేష స్పందన



మనుబోలులో పరీక్షను పరిశీలిస్తున్న ఎంపీడీఓ



విడవలూరు: పరీక్షను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

విడవలూరు: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎస్ఈఏఎస్) పరీక్షకు విశేష స్పందన లభించింది. రాష్ట్రంలో విద్యాప్రమాణాలను పరిశీలించేందుకు మండలంలోని 15 పాఠశాలలను ఎస్ఈఏఎస్ పరీక్ష నిర్వహణకు ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో 709 మంది విద్యార్థులకు గానూ 653 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ వెంకటేశ్వర్లు పరిశీలించారు.

మనుబోలు: మండలంలోని పదహారు పాఠశాలల్లో స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్(ఎస్ఈఏఎస్) పరీక్షను శుక్రవారం నిర్వహించారు. ఈ పరీక్షలను ఎంపీడీఓ ప్రసాద్ పరిశీలించారు. రాష్ట్రంలో విద్యాప్రమాణాలను పరిశీలించేందుకు 3,6,8 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన పరీక్షకు 538 మంది హాజరైనట్లు తెలిపారు. ఆయన వెంట ఎంఈఓ రమేష్, సీఆర్పీలు చెంచురామయ్య, స్వరూప, శ్రీనివాసులు, జయరామయ్య ఉన్నారు.

ప్రమాదకరంగా స్పీడ్‌బ్రేకర్లు



గ్రామీణ రహదారిపై ఏర్పాటు చేసిన స్పీడ్‌బ్రేకర్

పొదలకూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఇష్టారాజ్యంగా స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాల్లో ఆటోలు, ద్విచక్ర వాహనాల వేగాన్ని నియంత్రించాలని ఆయా గ్రామాల ప్రజలే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రమాదాల నివారణకు వేస్తున్న స్పీడ్ బ్రేకర్ల నిర్మాణంలో నిబంధనలు పాటించకపోతుండడంతో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. మరుపూరు మెయిన్‌రోడ్డు వద్ద ప్రమాదాలు జరగడంతో గ్రామస్తులు ఎత్తుగా స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత అవే స్పీడ్‌బ్రేకర్లు ప్రాణాలను హరించడంతో వాస్తవాన్ని గ్రహించిన గ్రామస్తులు వాటి ఎత్తును తగ్గించారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఒకటి నుంచి రెండు ప్రాంతాల్లో స్పీడ్‌బ్రేకర్లు నిర్మించడంతో ముఖ్యంగా ద్విచక్ర వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఆటోలు, బస్సులు సక్రమంగా నిలపడం లేదని అత్యుత్సాహంతో స్పీడ్‌బ్రేకర్లను నిర్మిస్తున్నారు. ఇలా అవసరం లేని ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను తొలగించాలని సంబంధిత అధికారులను వాహనచోదకులు కోరుతున్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ బీ చిరంజీవి

కోవూరు: ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జెడ్పీ సీఈఓ బీ చిరంజీవి సూచించారు. మండలంలోని పోతిరెడ్డిపాళెం పంచాయతీ పరిధిలోని గుంటకట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును శుక్రవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పక అమలు చేయాలన్నారు. వంట తయారీ సమయంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.

చేనేత ప్రతిభావంతులకు అండగా ఉంటాం



డెంటల్ విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

కోవూరు : నిరుపేద చేనేత కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు అండగా ఉంటామని కోవూరుకు చెందిన ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్, చేనేత ఉద్యోగుల ప్రొఫెషనల్ సంక్షేమ సంఘ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం వారు నెల్లూరులోని నారాయణ డెంటల్ కళాశాలలో నిరుపేద చేనేత కుటుంబానికి చెందిన డెంటల్ విద్యార్థిని ఆకురాతి చరితకు రూ.30వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ కోర్ కమిటీ సభ్యుడు కేవీ శేషయ్య మాట్లాడుతూ విజయవాడకు చెందిన ఆకురాతి చరిత డెంటల్ కోర్సు చేసేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడం తమ దృష్టికి రావడంతో దాతల సాయంతో తొలివిడతగా రూ.30వేలు అందజేసినట్లు తెలిపారు. తమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చరితకు నాలుగేళ్ల డెంటల్ కోర్సు పూర్తిచేసేందుకు అవసరమైన సాయాన్ని అందజేస్తామన్నారు. అనంతరం ఆర్థిక సాయం అందజేసేందుకు ముందుకొచ్చిన ఏలూరుకు చెందిన చామెర్ల శ్రీనివాసరావు, చేవూరు శ్రీనివాసులు దంపతులతో పాటు ఊకోటి వేణుగోపాల్, పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జీ మురళి, నారాయణ మెడికల్ కళాశాల మేనేజర్ బీ కోటేశ్వరరావు, ట్రాన్స్‌కో ఈఈ కే పరంధామయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు బీ నాగభూషణానికి ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ మల్లికార్జున, ఎస్ శ్రీనివాసులు ధన్యవాదాలు తెలిపారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో నెల్లూరు వాసికి పతకం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): దుబాయ్‌లో ఇటీవల నిర్వహించిన ఓపెన్ ఇంటర్నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో నెల్లూరుకు చెందిన భాగ్యలత 60 ప్లస్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారు. రాష్ట్రం నుంచి ఈ పోటీల్లో ఈమె ఒక్కరే పాల్గొన్నారు. కాగా ఇదివరకే ఆరు అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలను ఈమె సాధించారు.